# తప్పులు

**- ఆచంట హైమవతి**

చాలా విసురుగా ఆఫీసు మెట్లు దిగి వీధిలో ప్రవేశించాడు రమణమూర్తి. కొంతదూరం వరకూ అదే విసురు కొనసాగింది. దానిక్కారణమైన మోహన్ గాణ్ణి మనస్సులోనే మళ్ళీ తిట్టుకోవడం ప్రారంభించి.. ఇంకా కోపం తీరక తనని తనే తిట్టుకోసాగాడు.

అసలలాంటివారికి తను పూచీపడి ఉద్యోగం ఇప్పించడం ఏమిటి బుద్ధిలేనితనం కాకపోతే? తనకీ శాస్తి జరగాల్సిందే. ఎక్కడో తన తండ్రి వేలు విడిచిన మేనత్త ఆడపడుచు మనుమడికి...ఎంత దగ్గిర చుట్టరికమో... వాళ్ళ పేదరికం చూసి, జాలితో కరిగిపోయి పావు బక్కెట్ కన్నీరు కార్చి "మోహన్ డిగ్రీ పూర్తిచేశాడు కనక మావాడు గట్టి ప్రయత్నం చేసి ఉద్యోగం ఇప్పిస్తానాళ్ళెండి" అంటూ ఉదారంగా మాటిచ్చాడు నాన్న.

తను మరీను. అనుభవశూన్యుడు కదా. రెండు నేప్‌కిన్స్ కన్నీళ్లతో తడిపి, తండ్రి మాటకి ఒప్పేసుకుని అతణ్ణి తనతో తీసుకొచ్చి, ఆఫీసరు కాళ్ళావేళ్ళాపడి అసిస్టెంట్ అక్కౌంటెంట్ జాబ్ ఇప్పించాడు.

మోహన్ అర్ధ సంవత్సరం బాగానే పనిచేశాడు.

ఆ తర్వాత తన పైత్య ప్రయోగాలు ప్రారంభించాడు. రాసినవి ఫైల్లోకి ఎక్కించేటప్పుడూ.. కూడేటప్పుడు...టోటల్ ఇంపుగా కన్పించేందుకు అంకెల్ని రకరకాలుగా మార్చేస్తూంటాడు. కూడేందుకు అనుకూలం... సులభం కోసం ఒకటిని నాలుగు, ఏడు, తొమ్మిది దిద్దుతుంటాడు. సీనియర్ అక్కౌంటెంట్ మహా బద్ధకస్తుడు. అతడు సరిగా చూడడు. పట్టించుకోడు. సంతకం బరికేస్తాడు.

హెడ్‌క్లర్క్, సూపర్‌వైజర్ తనమీదుండే గౌరవం వల్ల తనవరకూ రాకుండా వాళ్ళే తప్పులు దిద్ది సర్దుకుపోయారు. పోను... పోనూ ఆ తప్పులు ఎక్కువకావడంతో ఊరుకోలేక పోయారు. తను మోహన్‌కి బుద్ధిచెప్పి వాళ్ళని సముదాయించేవాడు.

ఏదో పొరపాటున ఆ వేళ ఆ ఫైలు తిన్నగా ఆఫీసరు దగ్గరకే వచ్చేసింది. ఖాళీగా ఉన్న ఆఫీసరు ఆ ఫైలుని కూలకషంగా చూశాడు.

అసందర్భాలుగా ఉన్న ఆ తప్పుల తడకని చూసేసరికి అసలే బిపి పేషెంటేమో కోపంతో ఆగ్రహోదగ్రుడై పోయాడు. మోహన్ని, సీనియర్ అక్కౌంటెంట్‌ని, హెడ్‌క్లర్క్‌ని, రమణమూర్తినీ పిలిపించి భుజాలు పట్టుకుని గుంజిపారేసి, ఆపై...పీకలు నొక్కినంత పనిచేశాడు.

"ఈ ఫైలిలా హెడ్డాఫీసుకెడితే...నా...నా...నా..నీ...నీ...నీ...మీ....మీ..." ఉద్వేగంతో చెమటలు కారుతున్న అతడు తడబడి, తడబడి ఆయాసంతో కుర్చీలో కూలబడిపోయాడు.

అనుభవజ్ఞుడైన నౌకరు సమయానికి ఫోన్ స్పీడ్ పెంచి, మంచినీళ్ళు తాగించి ఆయన్ని సేద తీర్చాడు.

★ ★ ★

రెండు సున్నలుంటే మూడో సున్న చుట్టడానికి కూడా ఎందుకు వెధవ కక్కుర్తి? వేస్తే మహా ఏం జరుగుతుందేం? అదీ..చూద్దాం. ఇలా తలతిక్క చేష్టలు చేస్తే ఏ ఉద్యోగమైనా ఎన్నాళ్ళు నిలుస్తుంది?

సామాన్యమా... డబ్బుతో పని.. లెక్కలన్నీ సమంగా ఉంటేనే తప్పులెంచుతూ ఉంటారు. ఇక ఇలాంటివాడికి?...మూడు, నాలుగుసార్లు వార్నింగ్స్ ఇచ్చి కూడా తన మొహం చూసి ఇంత కాలం ఊరుకున్నారు.

"అలాకాదురా?" అని చెప్పబోతే-

"నాకన్నీ తెలుసు. ఫస్ట్‌క్లాస్‌లో ఎలా పాసయ్యాను మరీ?" అని సవాలు విసురుతాడు. నాలుగురోజులు బుద్ధిగా ఉంటాడు.

మళ్లీ మొదలు పేదవాడి ఫైలులా అన్పిస్తే అంకెలు అతి ఉదారంగానూ... ధనికుని ఫైల్ అనిపిస్తే ఘనంగానూ మార్చేస్తే...

"వాళ్ల కలిమి లేములతో నీకేం పని? నీ పని నువ్వు సక్రమంగా, సవ్యంగా చెయ్యి" అంటే చక్కగా బుర్ర ఆడిస్తాడు..కానీ మళ్ళీ మొదలు.

ఎలా వీడితో? తన ఉద్యోగానిక్కూడా చేటు కలిగేలా ఉంది పరిస్థితి. మోహన్ రాసే తప్పుడు లెక్కలు చదివి తనకే ఒళ్ళు మండి చెడామడా తిట్టేశాడు.

"రేపు ఆఫీసుకు రానవసరం లేదు. నిన్నెవరూ భరించలేరు. సాధ్యమైనంత తొందరగా పెట్టె సర్దుకుని చెక్కెయ్!" అని నిక్కచ్చిగా చెప్పేశాడు తను.

వాడిని, తననీ కలిపి ఆఫీసరు బయటకి పొమ్మనకముందే తను ఖరాకండీగా మోహన్‌కి చెప్పేసి తన బాధ్యత తీర్చుకున్నాడు.

★ ★ ★

ఆలోచనల్లో కొట్టుకుపోతూ గ్యారేజ్ దాటిపోబోతూ ఆగి వెనక్కి వచ్చాడు. 'స్కూటర్ రిపేర్ పూర్తయితే బస్ కోసం నిరీక్షించే బాధ లేకుండా హాయిగా ఇంటికెళ్ళిపోవచ్చును కదా' అనుకుంటూ ఉత్సాహం తెచ్చుకున్నాడు రమణమూర్తి.

ఇతడిని చూసి గ్యారేజ్ ఓనర్ పలకరింపుగా నవ్వాడు గాని ఆ నవ్వులో ఏదో వెలితి... దిగులు.. "ఎందుకు చెప్మా?" తన ప్రశ్నకు ఓనర్ చెప్పిన జవాబు విన్న రమణమూర్తికి తల గిర్రున తిరిగినట్టయింది.

అన్నీ విప్పేసిన పనినేర్చుకుంటున్న కుర్రాడు ఎక్కడో బిగించాల్సింది ఇంకెక్కడో తప్పుతప్పుగా బిగించాట్ట. స్టార్ట్ కావడం లేదు. ప్రయత్నిస్తే గుండెలు బద్ధలయ్యేంత శబ్దం వస్తోందట. నల్లని పొగ మేఘాలు కమ్మేస్తున్నాయట. ఆ ప్రాంతపు భూమి సన్నగా కంపిస్తోందట. ఇంకా...అదేదోట.. మరేదేదోనట... వర్ణన అయ్యాక "అన్నీ సుద్ధతప్పులుగా బిగించేశాడు సార్. బిగింపెక్కువై ఎంత ప్రయత్నించినా స్క్రూలు రావడం లేదు. కావాలంటే చూడండి సార్!" అంటూంటే అసలే బుర్ర పేట్రేగి ఉన్న రమణమూర్తి ఆ వాహనం ఉత్పత్తి చేసే పిడుగుల్ని ఆవాహన చెయ్యలేక చేతులెత్తి ఒక నమస్కారం చేసి ఇంక బస్సులో ప్రయాణం చేసే ఆసక్తి పూర్తిగా నశించి, ఖాళీ ఆటో ఆపి ఎక్కేశాడు. ఆటో పరుగందుకున్నాక చల్లగాలికి కొంత సేదతీరాడు రమణమూర్తి.

'ఆఫీసులో మోహన్ తప్పుడు లెక్కలు, గ్యారేజ్‌లో ట్రైనీ కుర్రాడి తప్పుడు బిగింపులు. ఇంక?

ఇంకేమీ ఉండవులే... ఇంటికెళ్ళిపోతున్నానుగా' తనని తనే సముదాయించుకున్నాడు.

★ ★ ★

ఆఫీసునించి రాగానే భర్తకు ఉత్తరం తెచ్చిచ్చింది వసంత.

కవర్ విప్పుతూ "ఈ దస్తూరి మా కోతిగాడిదే'' అన్నాడు రమణమూర్తి.

ఆ జాబు హనుమంతరావు దగ్గర్నుంచి వచ్చినట్లు తెలిసిపోయింది ఆమెకు. భర్త మురిపానికి నవ్వుకుంటూ కాఫీ తేవడానికి లోపలికి దారితీసింది వసంత.

ఉత్తరం చదవడం మొదలుపెట్టిన రమణమూర్తి మొహం చిరాకుతో ముడుచుకుపోయింది. తక్షణం చదవడం ఆపి వెంటనే జవాబు రాయడం మొదలుపెట్టేశాడు. ప్రారంభసూత్రాలు పూర్తిచేసి

"నేను ఏనాటినుంచో..ఎన్నిసార్లో బోధించిన విషయాన్నే మళ్ళీ ఇప్పుడు కూడా రాస్తున్నాను. నువ్వు ఏది రాసినా తిరిగి దానిని ఒకసారి చదువు. మరొకమారు కూడా చదివితే మరీ మంచిది. దాని వల్ల దోషం లేదు సరికదా.. రాసిన దాంట్లో దోషాలుంటే దిద్దుకోవచ్చు. తప్పనిసరిగా తప్పులు రాసే నీలాంటివాళ్ళు అక్షర దోషాలు సరిదిద్దుకునే వీలుంటుంది.

ఆ సంగతి ఎన్నిసార్లు మొత్తుకున్నా. నీకు బుద్ధి రాదేమిరా..?!''

కాఫీ తెచ్చి భర్తకివ్వబోయిన వసంతకి ఆశ్చర్యం వేసింది.

"అంత అర్జంట్‌గా జవాబు రాస్తున్నారేంటి? అసలు అతనేం రాశాడు?''


ఉత్తరంలోని హనుమంతరావు సంబోధన చదివి "అయ్యో! ఇదేమిటండీ... ఇలా రాశాడు?'' అంది తెల్లబోతూ.

ఆమె ముఖం కూడా అప్రసన్నంగా మారింది.

భార్యని సముదాయించి, ఆమె చేతిలోని కాఫీ తీసుకుని సిప్ చేస్తూ "వాడు చిన్ననాటినుంచీ అంతే వసంతా! ఉట్టి తొందర మనిషి. బరబరా బరికేయడమే కానీ తప్పొప్పులు పట్టించుకోడు. పోనీ తిరిగి చదవడు. తప్పులు దిద్దుకునే ప్రయత్నం చెయ్యడు. మనిషెంత మంచివాడైనా మంచి రాత కూడా ప్రధానమేగా?''

"ఇద్దరం కలిసి చదువుకునే రోజులనుంచీ వాడితో నాకిదే పెద్ద తలనొప్పి అయిపోయింది. ఆరోజుల్లో మా సాంబమూర్తి మేష్టారికి చేతిమీద కురుపువేచి వీడిని రాయడానికి పురమాయించారు. ఆయన చెప్పడం, వీడు రాయడం. ఇక





## తీరనికోరిక

గ్లామరస్ తార రంభకి ఎప్పటినుంచో ఒక కోరిక ఉందిట. అదేంటంటే విలక్షణనటుడు కమల్‌హాసన్‌తో కలిసి నటించాలని. 'దక్షిణాదిన రజనీకాంత్, చిరంజీవి, బాలకృష్ణ వంటి భారీ నటులతో కలిసి నటించాను. కాదల్ కాదల్‌లో ప్రభుదేవాతో కలిసి నటించాను. అయితే కమల్‌తో మాత్రం నటించలేకపోయాను. అది ఎప్పటికి నెరవేరుతుందో' అంటోంది రంభ. ఈమె లైలా, జ్యోతికలతో కలిసి నిర్మిస్తు, నటిస్తున్న 'త్రీ రోజెస్' ఇంకా వివాదాల సుడిగుండంనుంచి బయటపడలేదు. ఈ చిత్రాన్ని త్వరగా పూర్తిచేయడానికి తనటైంని హెచ్చిస్తోంది రంభ. ఇదిలా ఉంటే రంభ తెలుగు సీరియల్స్‌లో నటించడానికి తన ప్రయత్నాలు మొదలెట్టిందని వినికిడి.

చూడు ఆయన అవస్థ. ఆయన చెప్పేది 'వాక్యర్థం' అయితే వీడు 'వార్ధక్యం' అని రాశాడు.

ఆయన ఏం రాశావురా అంటే మీరు చెప్పినట్లే రాశాననేవాడు.

ఆయన నిజమే అనుకునేవారు. ఆయన 'వైవిధ్యం' అని రాయరా అంటే వీడు 'వైధవ్యం' అని రాసి పారేశాడు. 'ధ్యానం' అనే పదాన్ని 'ధాన్యం' అని రాశాడు. దస్తూరీ ముత్యాల కోవలాగా ఉంటుంది. చదవడం మొదలెట్టామా..ఘోరంగా ఉంటుంది''

"ఆ మేష్టారు చాలా పత్రికలకి వ్యాసాలూ అవీ రాసేవారు. ఆయన వ్యాసం, పద్యం, సుభాషితం వాళ్ల పత్రికలో ఉండడం ఒక ఘనతగా భావించి, రాసి పంపమని అడుగుతూండేవారు. గంభీరంగా ఉండే విషయాల గురించి ప్రస్తావిస్తూ ఇలాంటి అవాకులు, చవాకులు రాస్తే ఎంత తలవంపుగా ఉంటుంది? ఒక పేజీ మొత్తంలో ఏ ఒకటో అయితే పోనీలే పాపం అని సరిపెట్టుకుంటారు గాని..ఇలా ప్రతి పదానికి ఒక తప్పయితే నాకెలా తిట్టాలో తెలియడం లేదు.

ఇందులో సాంబమూర్తి మాష్టారి పాండిత్యం అందరికీ తెలుసు. అంతటి మనిషి ఇలా ఇన్ని తప్పుల తడకలు రాశారంటే ఎంతటి అప్రతిష్ఠ? ఒక్కోసారి మన వానరస్వామి ఒత్తులు పూర్తిగా విసర్జించేవాడు.

పోనీ ఆయనైనా ఆ పని ఇంకొకరికి చెప్పేవారా?

ఊహూ.. వాడే రాసి తీరాలనేవారు. వాడికి వాచకం, లేఖనం స్పష్టంగా రావాలనే కదా నా తాపత్రయం. తప్పులు ఎన్నాళ్ళు రాస్తాడు? క్రమేపీ వాడికే బాగా వస్తుంది'' అనేవారు.

"చూశావుగా వాడి రాతలు? సాంబమూర్తి మేష్టారు చచ్చి బతికిపోయారు గాని.. లేకపోతే ఈ వయసులో కూడా వీడు ఇలా రాయడం చూసి హతాశులై గుండె ఆగి చక్కాపోయేది ఆయనకి'' రమణమూర్తి చెప్పేతీరుకి నవ్వు. భాష ఖూనీ అయిపోతోందనే అతని ఆక్రోశానికి జాలి కలిగాయి వసంతకి.

"ఏదో సందర్భంలో ఆయన్ని సత్కరించారు అని రాయడానికి ఆయన్ని తస్కరించారు అని రాసేశాడు. ఆ పదాన్ని అలాగే అర్థం చేసుకున్న కొందరు ఆయన్నెవరో కిడ్నాప్ చేశారు అనుకున్నారు.

'భావనలు' అని రాయడానికి 'భవనాలు' అదీ 'కృష్ణపక్షం' అని రాయడానికి 'కృష్ణవక్షం' అనీ రాసి తిట్లు తిన్నాడు.

'భక్తిరంజని'ని 'రక్తిభంజని'గా మార్చేసిన ప్రబుద్ధుడు మావాడు. వాడసలు ఉత్తరం రాసేది నాకొకడికే అనుకో? కానీ ఏమిటో నేను సరిపెట్టుకోలేకపోతున్నాను. కనుక వాడికి మళ్ళీ బుద్ధి చెప్తూ రాశా. కాని.. వాడు మారడు కాక మారడు వసంతా! వాడి మనమలే వాడికి బుద్ధి చెప్పాలంతే...''

"ఈరోజుల్లో అందరూ ఇంగ్లీషు మీడియం కదా. వాళ్లకైతే తెలుగు రానప్పుడు తాతకెలా నేర్పగలరు?'' వసంత సందేహం.

"మాతృభాషలోనే తప్పులు రాసిన మహానుభావుడు ఇక ఇంగ్లీషులో రాయడేమిటి? తప్పకుండా రాస్తాడు. యూ డోంట్ వర్రీ'' అన్నాడు రమణమూర్తి దంపతులిద్దరూ నవ్వుకున్నారు.

దీర్ఘంగా నిట్టూర్చి మిత్రుడి ఉత్తరం పూర్తిగా చదివిన తర్వాత ఎప్పటి అలవాటు ప్రకారం తను రాసిన జాబు చదవడం మొదలుపెట్టాడు. ప్రారంభంలో తను రాసింది చూస్తూనే ఉలిక్కిపడ్డాడు. కంగారుగా మరొకసారి చదివి 'తను కూడా ఇలా తప్పు రాశాడేమిటి?' అనుకుంటూ 'రాసేటప్పుడు అక్షరదోషాలు రావడం సహజమే. అందుకే ఒకటి, రెండుసార్లు చదవమనేది కూడాను'' అనుకుంటూంటే అతడికి కావాలని తప్పులు రాసే మోహన్ గుర్తుకువచ్చాడు మళ్లీను.

'మండపేట అనే ఊరిపేరు రాస్తూ పోయిందే ముందిలే అని మొదటి అక్షరానికి ఇంకొకొమ్ము ఉదారంగా ఇచ్చేస్తే కొంపమునిగిపోదూ?'

తను రాసిన అక్షర తప్పుకి షాక్ తినేశాడు రమణమూర్తి.

గాబరాగా "ఉ...ఫ్'' అనుకుంటూ చెయ్యి నెత్తిమీదెట్టుకున్నాడు.

హనుమంతరావు "డియర్ మరణమూర్తికి'' అని రాశాడు.

అతనికి గట్టిగా బుద్ధిచెప్తూ జాబు రాస్తూ అతన్ని అంత గేలిచేస్తూ 'ఇది హితుని లేఖా?' అని రాయబోయి 'ఇది హతుని లేఖా?' అని రాశాడు. ఉత్తరం ద్వారా మా కపిరాయుడి గాలి నాకూ సోకిందా? ఆ ఉత్తరం ముక్కలు చేసి పారేస్తూ 'ఇంకా నయం. నేనూ వాడిలా చదవకుండా పోస్ట్ చేశాను గాదు. మై గుడ్‌నెస్ పునఃపరిశీలనం బహు ఉత్తమం అనే సంగతి మరొకసారి రుజువైంది' అనుకుని తేలిగ్గా నిట్టూర్చాడు రమణ..రమణమూర్తి.

"అక్షరతప్పు చిన్నదే అయినా చావు-బతుకుల మధ్యనున్న అర్థాన్నే మార్చేయగలదు గదా'' ఆశ్చర్యపోతూ అంది వసంత.

★

